సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 4 । జూన్ । 2023

కిడ్నాప్ చేసి మట్టుబెట్టారు



ఆర్థిక లావాదేవీల కారణంగా ఊటుకూరుకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి వ్యక్తిని కిడ్నాప్ చేసి మట్టుబెట్టారు.

-10లో..



ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

ఐదుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. 62 ఎర్రచందనం దుంగలను స్వా. దీనం చేసుకున్నారు.

-10లో..



తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

అట్లూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ గణేష్‌కుమార్ తనిఖీ చేశారు.

-10లో..

కొలువుల సందడి

- దరఖాస్తుకు రెండు రోజులే గడువు
- జిల్లాలో 113 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- జూన్ 5 అర్ధరాత్రి వరకు దరఖాస్తులకు గడువు
- మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం



మైదుకూరులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం

కడప ఎడ్యుకేషన్: నిరుద్యోగులకు ఉపాధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) కాంట్రాక్టు పద్ధతిలో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రత్యేక అధికారులతోపాటు బోధనా సిబ్బంది నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందుకు సంబంధించి జూన్ 5వ తేదీ అర్ధరాత్రి 11.58 నిమిషాల వరకు గడువు ఇచ్చింది. దీంతో అర్హత గల నిరుద్యోగ మహిళలు దరఖాస్తులు చేసుకోవడం ప్రారంభించారు.

కేజీబీవీల్లో ఖాళీల వివరాలు ఇలా...

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో ప్రిన్సిపాల్ పోస్టులతో పాటు బోధనా సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలానికి అర్హులైన ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో 9 ప్రిన్సిపాల్ పోస్టులకు, 21 పీఆర్టీ పోస్టులకు, 77 పీజీటీ పోస్టులకు, 6 పీఈటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.



- ఇందులో సీఆర్టీలకు సంబంధించి 6 ఇంగ్లిష్, 2 హిందీ, 4 మ్యాథ్స్, 3 న్యాచురల్ సైన్సు, ఒక ఫిజికల్ సైన్సు, 5 సోషియల్ పోస్టులకు అలాగే 6 పీఈటీ పోస్టులకు, పీజీటీ పోస్టులకు సంబంధించి 8 బాటనీ, 19 కెమిస్ట్రీ, ఒక సివిక్స్, ఒక ఎకనామిక్స్, 12 ఇంగ్లిష్, రెండు జీఎఫ్‌సీ(జనలర్ ఫౌండేషన్ కోర్సు), ఒక హిస్టరీ, 9 మ్యాథ్స్, ఒక ఎంపీహెచ్‌డబ్ల్యూ , 15 ఫిజిక్స్, 7 జువాలజీ, ఒక సీఎస్‌సీ(కంప్యూటర్ సైన్సు) ఇలా మొత్తంగా 113 పోస్టులను భర్తీ చేయనున్నారు. కేజీబీవీల్లో పని చేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థులు తమ అర్హతకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాల్సి ఉంది. apkfbv.-o/a pcfrr.in వెబ్‌సైట్‌లో రూ. 100 చెల్లించి ఆన్‌లైన్‌లో తమ పూర్తి వివరాలను నమోదు చేయాలి. జూన్ 5వ తేదీ అర్ధరాత్రి 11.58 నిమిషాల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్, నేరుగా దరఖాస్తులు స్వీకరించబడవని అధికారులు స్పష్టం చేశారు.

వయో పరిమితి వివరాలు ఇలా...

కేజీబీవీల్లో నిర్వహించే ఉద్యోగాలకు సంబంధించి ఓపెన్ కేటగిరికి చెందిన అభ్యర్థుల అర్హత వయసు 18 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 ఏళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు 3, దివ్యాంగులకు 10 ఏళ్లు వయో పరిమితి నడలింపు ఉంది. కావున అర్హులైన వారు గడువులోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

యాక్టివిటీ	టైమ్‌లైన్
అప్లికేషన్ దరఖాస్తుకు గడువు	జూన్ 5వ తేదీ వరకు
మెరిట్ లిస్టు తయారీ	జూన్ 6,7 తేదీలలో
సర్టిఫికెట్ల వెరిఫికేషన్	జూన్ 8 నుంచి 9 వరకు
పర్సనాలిటీ టెస్టు	జూన్ 10 నుంచి 12 వరకు
ఫైనల్ సెలెక్షన్ లిస్టు	జూన్ 12
అపాయింట్‌మెంట్ ఆర్డర్ జారీ	జూన్ 13
రిపోర్టింగ్ చేయాల్సింది	జూన్ 14

ప్రభుత్వ ఆదేశాల మేరకు...



కేజీబీవీల్లో ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిసున్నాం. ఉమ్మడి జిల్లా పరిధిలోని 29 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఏడాది కాలపరిమితితో సిబ్బందిని నియమించేందుకు సన్నాహాలను చేస్తున్నాం. జిల్లాలో పోస్టుల వివరాలు, విద్యార్హతల గురించి వెబ్‌సైట్‌లో పొందుపరిచాము. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

రైతులందరూ లబ్ధి పొందేలా చూస్తాం

మైదుకూరులో పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం



పసుపు కొనుగోలు కేంద్రంలో జేసీ గణేష్‌కుమార్, వ్యవసాయ, ఉద్యానశాఖల సలహాదారులు

మైదుకూరు : అర్హులైన రైతులందరూ కొనుగోలు కేంద్రం ద్వారా లబ్ధి పొందేలా చూస్తామని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. మైదుకూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని ఆరు కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. కనీస మద్దతు ధర కింద క్వింటాల్‌కు రూ.6,850లకు రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. రైతుల నుంచి ఈక్రాప్, ఓటీపీ పద్ధతిలో మాత్రమే పంటను కొనుగోలు చేస్తున్నట్టు జేసీ పేర్కొన్నారు. వ్యాపారులకంటే ప్రభుత్వమే గరిష్ట ధర చెల్లిస్తోందన్నారు. ప్రతి రైతు నుంచి 30 క్వింటాళ్ల పంటను కొనుగోలు చేస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. పసుపు రైతుల ఇబ్బందులు గమనించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని ధన్యవాదాలు తెలిపారు. ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో సరైన ధరలేక పసుపు రైతులు పడుతున్న ఇబ్బందులు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకుపోగా, ఆయన స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు ఆదేశించారని తెలిపారు. అంతే కాక మార్కెట్‌లో వ్యాపారులు పెట్టిన ధరకంటే ఎక్కువగా క్వింటాల్‌కు రూ.6,850 ధర నిర్ణయించడం రైతులను ఆదుకునే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, తహసీల్దార్ అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎల్ రఘురామయ్య, ఏసీకే తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి బస్సుకు తప్పిన పెను ప్రమాదం

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డు మలుపులో విరిగిన జాయింట్



మలుపులో ఆగిపోయిన పెళ్లిబస్సు

బి.కొత్తకోట : రాజమండ్రి నుంచి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వస్తున్న పెళ్లి బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. శనివారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలు..హార్సిలీహిల్స్‌పై గవర్నర్‌బంగ్లా, స్విమ్మింగ్ పూల్ ఎదుట ఖాళీ స్థలంలో ఓ ఉన్నతాధికారి వివాహ వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఈ పెళ్లికి హాజరయ్యేందుకు రాజమండ్రి నుంచి 40 మంది ప్రయివేటు బస్సులో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరారు. బస్సు శనివారం ఉదయం 10 గంటల సమయంలో కొండ ముఖద్వారానికి చేరుకుని ఘాట్‌రోడ్డులో ప్రయాణం మొదలైంది. రెండు మలుపులు దాటుకుని అత్యంత ప్రమాదకరమైన మూడో మలుపు ఎక్కుతోంది. (దీన్ని ప్రొద్దుటూరు మలుపు అంటారు, ఇక్కడ 40 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరుకు చెందిన పెళ్లి బస్సు ప్రమాదానికి గురై అందరూ మృత్యువాత పడ్డారు.) ఇది చాలా ఇరుకుగా, ఎత్తుగా ఉండే మలుపు కావడంతో బస్సులు, మినిలారీలు, లారీలు ఈ మలుపు దాటుకుని వెళ్లడం కష్టంతో కూడింది. సరిగ్గా మలుపు మధ్యలో పెళ్లిబస్సు జాయింట్ రాడ్ విరిగి పోయి ముందుకు కదల్లేదు. ఎత్తులో ఉన్న బస్సు వెనక్కు కిందకు జారి మలుపువద్ద నిర్మించిన ఇనుప కంచెను ఢీకొనాల్సింది. అయితే డ్రైవర్ చాకచక్యంతో ఆగిన బస్సు అక్కడే నిలిచేలా ప్రయత్నించి చక్రాల కింద రాళ్లు పెట్టాడు. లేదంటే బస్సు వెనక్కు వచ్చి ప్రమాదానికి గురయ్యేది. ఇనుప కంచెను ఢీకొని అక్కడితో ఆగడమో లేక ఇంకేమైనా జరిగేది. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకపోవడంతో బస్సులోని వారిని వాహనాల్లో కొండపైకి వెళ్లారు. ఎస్ఐ రామమోహన్ రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



మార్కెటింగ్‌శాఖ డీడీకి అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

కడప అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీకాంత్‌రెడ్డి శనివారం కడప మార్కెట్‌యార్డులోని కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. యార్డులు, రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్య సేవలో భాగంగా ఏర్పాటు చేసిన వాహనాలకు(1962) డ్రైవర్లు, పారవెట్ అండ్ వెటర్నరీ డాక్టర్లు కావాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ జిల్లా కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ తెలిపారు. డ్రైవర్ పోస్టులకు వయసు 36 సంవత్సరాల లోపు ఉండి 10వ తరగతి పాసై హెవీ వెహికల్ లేదా బాడ్జీ 3 లైసెన్సు కలిగి మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. అలాగే 5.4 అడుగుల ఎత్తు కలిగి ఉండాలన్నారు. అలాగే పారవెట్ పోస్టులకు సంబంధించి డిప్లమో ఇన్ వెటర్నరీ అర్హత ఉండాలన్నారు. వయసు 30 సంవత్సారాల లోపు ఉండాలన్నారు. అలాగే డాక్టర్‌కు బీవీఎస్‌సీ లేదా ఎంవీఎస్‌సీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హులైన వారు జూన్ 6వ తేదీన కడపలోని జిల్లా పశు వైద్యశాల ఆవరణలోని వెటర్నరీ పాలిక్లీనిక్‌కు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని అనిల్‌కుమార్ తెలిపారు. వివరాలకు 9154970180 నంబరులో సంప్రదించాలన్నారు.

కేంద్రబృందం పర్యటన



చిన్నదాసరిపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పెండ్లిమర్రి: మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామంలో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన తాగునీటి పథకాన్ని శనివారం రాత్రి జలజీవన్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు రానా ఆర్.కే.సింగ్, నవనీత్ కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పర్యటించి తాగునీరు సక్రమంగా వస్తోందా, ఇబ్బందులేమైనా ఉన్నాయా, పారిశుద్ధ్య పనులు చేస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏఏ పనులు చేపట్టారు అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, సర్పంచ్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథ్‌రెడ్డికి ఉత్తమరైతు పురస్కారం



కడప అగ్రికల్చర్: వ్యవసాయంలో అద్వితీయమైన సేవలు, నూతన ఆలోచనలకు గుర్తింపుగా 2023 సంవత్సరానికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రామాపురం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన యన్.శ్రీనాథ్‌రెడ్డి ఎంపికయ్యారని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీన శ్రీనాథ్‌రెడ్డికి పురస్కారం, జ్ఞాపికతో పాటు రూ.25 వేలు నగదు అందజేస్తారన్నారు.

సంపూర్ణ పోషణ.. పేదలకు వరం

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో సత్ఫలితాలు
- రక్తహీనత నివారణకు దోహదం
- గర్భిణిలకు అందుతున్న పౌష్టికాహారం
- జిల్లా వ్యాప్తంగా 29,127 మందికి లబ్ధి



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలు (ఫైల్)

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు	11
జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు	2,389
గర్భవతులు	14,888
బాలింతలు	14,239
చిన్నారులు	1,57,015



పథకాలకు సంబంధించిన పోస్టర్

కడప కోటిరెడ్డిసర్కిల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలు ఇస్తోంది. ఈ పథకం వల్ల ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తు న్నాయి. పేదరికం వల్ల గర్భిణీలు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల వారికి పుట్టిన బిడ్డలు పోషణలోపంతో బాధపడుతూ గతంలో అనేక వ్యాధుల బారిన పడేవారు. అలాగే పిల్లలు సరైన ఎదుగుదలకు నోచుకోవడం లేదని ప్రభుత్వం గుర్తించింది. గర్భిణులకు పోషకాహారం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీంతో ఎంతో మందికి దీనివలన ఉపయోగం కలుగుతోంది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్డుకు అదనంగా మరో ఆరు రకాల పోషకాహార సరుకులను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గింది. తద్వారా ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా......

జిల్లా వ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2389 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు14,888, బాలింతలు 14,239 మంది, 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 73,804, 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 48,233 మంది ఉన్నారు. వీరందరూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో లబ్ధి పొందుతున్నారు.

సంపూర్ణ పోషణ కిట్‌ల సరఫరా...

గర్భిణులకు, బాలింతలకు కిలో రాగిపిండి, కిలో జొన్నపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, 250 గ్రాముల ఎండు కర్జూరం, 3 కిలోల బియ్యం, అరకిలో నూనె, అరకిలో పప్పు , 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇస్తున్నారు. వీటన్నింటిని డ్రై రేషన్‌గా లబ్ధిదారులుకు ఇంటికి ఇస్తున్నారు. అలాగే 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు నెలకు రెండున్నర కిలోల బాలామృతం , రెండున్నర లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు అందిస్తున్నారు. 3 నుండి 6 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం వండి పెడుతున్నారు.

నాణ్యతతో వండి పెడుతున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యతతో కూడిన ఆహారాన్ని వండి పెడుతున్నారు. అలాగే వైద్య సలహాలు కూడా సకాలంలో ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయం. – లక్ష్మీ ప్రసన్న , గర్భవతి, కడప

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం...



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భవతులకు, చిన్నారులకు కూడా కేంద్రాలలోనే పౌష్టికాహారం అందించడం సంతోషకరం. మంచి కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. – శిరిష, బాలింత, కడప

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. గతంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఇచ్చేవాళ్లం. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలలోనే వండి పెడుతున్నాం. – ఎంఎస్ రాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, కడప

తొలి తెలుగు శాసనాన్ని కాపాడుకుందాం



బ్రాహ్మణపల్లెలోని ఓ చెట్టు వద్ద ఉన్న శాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందులలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ 1509 అక్టోబర్ 24వ తేదీన స్థానిక శ్రీరంగనాథుని నైవేద్యానికిగాను కుందలూరు (ప్రస్తుతం వీరపునాయునిపల్లె గ్రామ సమీపంలో ఇందుకూరు) గ్రామాన్ని దానం చేసి ఉండవచ్చునని పురావస్తు అధికారులు భావిస్తున్నారు. ఓ గ్రామాన్ని దానం చేసిన తొలి తెలుగు శాసనం ఇలా నిర్లక్ష్యానికి గురైందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని శ్రీరంగనాథస్వామి ఆలయ సమీపంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న ఈ శాసనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషిక్తుడైన తర్వాత విడుదల చేసిన తొలి తెలుగు శాసనం పులివెందులలో ఉండటం గర్వకారణమన్నారు. ఈ శాసన సారాంశాన్ని ఇప్పటి లిపి, భాషలో రాయించి శ్రీరంగనాథస్వామి ఆలయానికి కానీ, పులివెందుల పట్టణ పార్కులో కానీ తరలించి ఈ శాసనాన్ని భద్రపరచాలని ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ మాజీ అధికారి చంద్రమోహన్ రెడ్డి, శిల్పారామ సీఈఓ శ్యాంసుందర్‌రెడ్డి, శిల్పారామ ఏఓ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

12న విత్తన మహోత్సవం

కడప అగ్రికల్చర్: గుంటూరులో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 12వ తేదీన విత్తన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం నుంచి విడుదలైనటువంటి వివిధ రకాల పంటల విత్తనాల ప్రదర్శన, అమ్మకం ఉంటుందన్నారు.

రైలు ప్రమాద బాధితుల కోసం కంట్రోల్ రూమ్

కడప సెవెన్‌రోడ్స్: ఒడిస్సా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో జిల్లాకు సంబంధించిన బాధితుల వివరాలు తెలిపేందుకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబరు 08562-246344కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు.

బాలికపై అత్యాచారం : వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండలంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో చాంద్‌బాషా అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి బాలికపై అఘాయిత్యానికి పాల్పడుతుండగా కుటుంబ సభ్యులు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాంద్‌బాషాపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

టీడీపీ ఐదేళ్ల పాలన అవినీతిమయం

- మా పాలనలో అవినీతి జరిగినట్లు దమ్ముంటే నిరూపించు
- పుట్టా ఆరోపణలపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గంలో టీడీపీ ఐదేళ్ల పాలన అంతా అవినీతిమయమేనని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని వాస్తవాలు తెలుసుకోకుండా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆరోపణలు చేయటం తన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన అవినీతిమయమంటూ పుట్టా చేసిన ఆరోపణలపై శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు.

మా హయాంలో రూ.కోట్లతో అభివృద్ధి

మైదుకూరు మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయని పరిస్థితి ఉండగా తాము వచ్చాక ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, ఎర్ర చెరువు, కేసీ కెనాల్ సుందరీకరణ, పార్కులు తదితర అభివృద్ధి రూ.75కోట్లతో ప్రణాళిక తయారు చేసి అమలు చేస్తున్నామన్నారు. అదే టీడీపీ పాలనలో ఖాజీపేట సభలో మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించిన చంద్రబాబు కేవలం రూ.2కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. తమ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైదుకూరు అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఇందులో రూ.34కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల, రూ.32కోట్లతో వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు.మీ హయాంలో సీసీ రోడ్లు, కల్వర్టులు వేయకుండా బిల్లులు చేసుకుని రూ.71కోట్లు అవినీతికి పాల్పడటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. స్వచ్ఛభారత్ కింద మంజూరైన మరుగుదొడ్లు కట్టకుండానే కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం నిజం కాదా అన్నారు. ఇందుకు సంబంధించి విజిలెన్స్ విచారణలో దోషులుగా తేలి మున్సిపాలిటీ అధికారులు, కాంట్రాక్టర్లు జైలుకు వెళ్లలేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని దమ్ముంటే పుట్టా నిరూపించాలన్నారు.టీడీపీ హయాంలోనే అవినీతి జరిగిందని, అందులో పుట్టా కుటుంబానికి కూడా భాగం ఉందని ఆరోపించారు. నియోజకవర్గంలో తాను మట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్న పుట్టా.. చట్ట వ్యతిరేకంగా ఒక్క క్వారీ ఉన్నా దమ్ముంటే నిరూపించాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే భూముల పందేరమా..

నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నామని ఆరోపిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్ అసలు అసైన్‌మెంట్ కమిటీ సమావేశమే జరగలేదన్న విషయం తెలుసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాము ఏ ఒక్కరికీ ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. టీడీపీ ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గానీ, భూమి లేని నిరుపేదలకు గానీ ఒక్క సెంటు భూమి ఇవ్వలేదని, అసైన్‌మెంట్ కమిటీ పేరుతో పచ్చచొక్కాల వారికి మాత్రమే వందల ఎకరాలు కట్టబెట్టారన్నారు. పుట్టా సొంత తమ్ముడైన ప్రభాకర్ భార్య నాగలక్ష్మీ పేరుతో సర్వే నంబరు 859-1లో 4.80 ఎకరాల భూమితో పాటు అనధికారికంగా ప్రభుత్వ భూమిని పొందలేదా అని ప్రశ్నించారు. నీ పార్టీకి చెందిన మాచుపల్లె శ్రీనివాసులనాయుడుకు సర్వే నంబరు 840లో 20 ఎకరాలు కట్టబెట్ట లేదా అన్నారు.తువ్వపల్లె చెరువులో రామచంద్రనాయుడు, సింహం పెద్ద మల్లయ్య ఆధ్వర్యంలో 60 ఎకరాల మేర ఆక్రమించి బోర్లు వేసి సాగు చేస్తోంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

కాశీలో జిల్లా వాసి మృతి


గంగిరెడ్డి(ఫైల్)

అట్లూరు : ఇండియన్ పెంట్రోలు బంకు యజమాని కొమారి గంగిరెడ్డి(74) కాశీయాత్రకు వెళ్లి అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందాడు.బంధువుల కథనం మేరకు అట్లూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన గంగిరెడ్డి పదిరోజుల కాశీయాత్ర నిమిత్తం సతీమణితో కలిసి వెళ్లాడు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు.వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాడరు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.అందరికీ పెళ్లిల్లు కూడా అయ్యాయి.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

వీరబల్లె (రాయచోటిటౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వైర్లు కాలిపోయి మంటలు చెలరేగాయి. దీంతో ఆ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ప్రింటర్లు కాలి బూడిదయ్యాయి.


ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్


నిందితులు, స్వాధీనం చేసుకున్న దుంగలతో డీఎస్పీలు చెంచుబాబు, మురళీధర్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాలో సిద్దవటం, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తదితర అటవీప్రాంతాల్లో జరిగిన మూడు సంఘటనల్లో ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, మొత్తం 62 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు ఆధ్వర్యంలో మూడు బృందాలు శుక్రవారం కూంబింగ్ చేపట్టాయి. రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్ఐ కృపానంద టీమ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మానికతో కలిసి సిద్దవటం రేంజ్, ముత్తుకూరు అటవీప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం 4 గంటల సమయంలో దబ్బకోన ఫారెస్ట్ ఏరియా చేరుకునేసరికి కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను పడేసి చీకట్లో పారిపోయారు. అయితే ఐదురురిని పట్టుకోగలిగారు. పట్టుబడిన వారిలో నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన చిల్పం సాంబయ్య, యడమకంటి రమణయ్య, వైఎస్ఆర్ జిల్లా కుంభగిరికి చెందిన ముద్దా నరసింహులు, ఖాజీపేటకు చెందిన నక్కా వెంకటేష్, బద్వేల్ టౌన్‌కు చెందిన వనం చెన్నయ్య ఉన్నారు. వీరి నుంచి 753 కిలోల బరువున్న 26 ఎర్రచందనం దుంగలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఆర్ఐ కె. సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ టీమ్ అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు తుమ్మలబైలు సెక్షన్ నుంచి కూంబింగ్ చేపట్టారు. కరకు ఏరు ప్రాంతం వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టేలోపు దుంగలను పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలు లభించాయి. మరో సంఘటనలో ఆర్ఎస్ఐ పి. నరేష్ టీమ్ పోరుమామిళ్ల మండలం, తంబళ్లపల్లి సెక్షన్ నుంచి కూంబింగ్ చేపట్టారు. నాగలకుంట్ల పోస్టు, రామేశ్వరం గ్రామంలో రాచకొండ రామయ్య ఇల్లు గ్రామం చివర ఉండటంతో అనుమానంతో అక్కడికి చేరుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని చూసి రామయ్య అక్కడి నుంచి పారిపోయాడు. ఇంతకు ముందు అతను ఫారెస్ట్ వాచర్‌గా పనిచేసేవాడు. ఇంట్లో సోదా చేసి 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 62 ఎర్రచందనం దుంగల విలువ రూ. 60 లక్షలు వరకు వుంటుందనీ అంచనా వేశారు. ఈ మూడు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేశారు. సీఐ బాలకృష్ణ, ఎస్ఐ మోహన్‌నాయక్ విచారిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లలో పాల్గొన్న బృందాలకు డిఐజీ సెంథిల్‌కుమార్ రివార్డులు ప్రకటించారు.

కిడ్నాప్ చేసి మట్టుబెట్టారు

మృతదేహాన్ని గుర్తించిన బంధువులు


శ్రీకాంత్ రెడ్డి (ఫైల్)

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె : ఆర్థిక లావాదేవీలే అతని దారుణ హత్యకు దారితీశాయి. తన స్నేహితుడికి డబ్బులను పూచీ పడిన పాపానికి అతన్ని పిలిచి దారుణంగా కొట్టి, చంపి తమపైకి రాకుండా ఉండేందుకు చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలోకి తీసుకుని వెళ్లారు. మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించి తగులబెట్టారు. ఈ సంఘటనలో మృతుడి శరీరంపై వున్న దుస్తులు, చేతికున్న పచ్చబొట్టు 'కె.సుహాసిని' అనే గుర్తు ఉండటంతో అతని బంధువులు శ్రీకాంత్ రెడ్డి(39)గా గుర్తించారు.

దీంతో శ్రీకాంత్ రెడ్డి హత్యకు గురయ్యాడని ప్రాథమికంగా తెలుసుకుని పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ సంఘటనపై విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. కడప నగర శివార్లలోని ఊటుకూరుకు చెందిన శ్రీకాంత్ రెడ్డి (39) అక్కాయపల్లిలో టీ దుకాణం పెట్టుకుని జీవించేవాడు. నష్టం రావడంతో ఆ వ్యాపారాన్ని చాలించాడు. ఈక్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను మొదట 'కె. సుహాసిని' అనే మహిళను ప్రేమించి వివాహం చేసుకోవాలనుకున్నాడు. అతని చేతికి ప చ్చబొట్టు కూడా పొడిపించుకున్నాడు.ఈ పచ్చబొట్టే అతన్ని గుర్తించేలా ఉపయోగపడింది. తరువాత మరో మహిళను వివాహం చేసుకున్నాడు. వారి మధ్యన మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇదిలా వుండగా శ్రీకాంత్ రెడ్డి, దేవునికడపకు చెందిన తన స్నేహితుడు సత్యంకు ముత్తరాసపల్లెకు చెందిన 'లేడీ డాన్'గా పిలువబడే ఓ మహిళ నుంచి రూ. 8 లక్షలు, సత్యం పనిచేసే యజమాని దగ్గర కొన్ని లక్షల రూపాయలను అప్పుగా ఇప్పించాడు. ఈ మొత్తాలకు మృతుడు శ్రీకాంత్‌రెడ్డే పూచీగా ఉన్నాడు. సత్యం డబ్బులను కట్టలేదని, ఈనెల 1వ తేదీన లేడీడాన్, మరో వ్యక్తి తమ మనుషులతో శ్రీకాంత్‌రెడ్డిని తమ ప్రదేశంలోకి పిలిపించారు. శ్రీకాంత్‌రెడ్డిని కొట్టి హింసించారు. ఈక్రమంలోనే అతను ప్రాణాలు కోల్పోయాడు. తరువాత మృతదేహాన్ని ఎవరికీ అనుమానం రాకుండా కనిపించకుండా చేయాలనీ 'రెక్కీ' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'లేడీ డాన్' ఆదేశాల మేరకు సత్యం యజమాని, ఇంకా కొందరు కలిసి మృతదేహాన్ని ఈనెల 1వ తేదీ సాయంత్రం లేదా రెండో తేదీన ఉదయం సమయంలోనో బుగ్గలేటిపల్లె సమీపంలోని వంకలోకి తీసుకెళ్లారు. తాము అనుకున్న ప్రకారం శ్రీకాంత్ రెడ్డి మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. తరువాత తమంతట తాము పరారయ్యారు. ఇదే సమయంలో శ్రీకాంత్ రెడ్డి సెల్‌ఫోన్‌ను నిందితులు తమ వెంట తీసుకుని వెళ్లారు. తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో అతని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈనెల 2న సాయంత్రం పోలీసులు చింతకొమ్మదిన్నె పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడని, పచ్చబొట్టు ఆధారంగా శ్రీకాంత్‌రెడ్డిని గుర్తించారు. రిమ్స్ వైద్యులతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి సోదరుడు శ్రీమంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డిలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనలో ఆరుగురి పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అందరిపై నిఘా ఉంచారని, నేడో, రేపో మీడియా ముందు నిందితులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

అనారోగ్యంతో ఇద్దరి ఆత్మహత్య

మదనపల్లె : అనారోగ్యం భరించలేక ఇద్దరు ఆత్మహత్యకు పాలపడ్డారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలు..పీటీఎం మండలం బాగేపల్లెకు చెందిన వెంకటేష్‌రెడ్డి(46) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పి బారినపడి, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం మరోసారి కడుపునొప్పి తీవ్రతరం కావడంతో భరించలేక పురుగుల మందుతాగాడు. అపస్మారస్థితిలో ఉన్న బాధితుడిని కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతుడికి భార్య సునీత, కుమార్తె తన్వీక(2) ఉన్నారు.

- సత్యసాయి జిల్లా కదిరి పట్టణం బాబాకాలనీకి చెందిన శ్రీరాములు (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఉపాధి కోసం కొంత కాలం కిందట బి.కొత్తకోట పట్టణానికి వచ్చాడు. ఇది వరకే అతను అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం మరోసారి అనారోగ్యం బారిన పడటంతో శ్రీరాములు మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నేడు ఆచార్య 'కేతు' సంస్మరణ సభ

కడప కల్చరల్ : సుప్రసిద్ధ కథా రచయిత, జిల్లాకు చెందిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభను తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి అరసం జిల్లా అధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారని ఆయన తెలిపారు. అరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పి.సంజీవమ్మ, జిల్లాకు చెందిన పలు సాహితీ సంస్థలు, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఆచార్యకేతు విశ్వనాథరెడ్డి అభిమానులు, యువ రచయితలు, కవులు హాజరు కావాలని ఆయన కోరారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


అట్లూరు తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్,

అట్లూరు : అట్లూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ గణేష్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల గదిని పరిశీలించారు. రికార్డులను భద్రతపై అసహనం వ్యక్తం చేశారు.అనంతరం కార్యాలయ ఆవరణాన్ని కూడా పరిశీలించారు. ఆయన వెంట బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకుల వెంకటరమణ,తహసీల్దారు శ్రీవాణి, సీనియర్ అసిస్టెంటు సుధాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తిపై దాడి

– పోలీసులకు ఫిర్యాదు

కమలాపురం : మండల పరిధిలోని జంగంపల్లెకు చెందిన జనార్ధన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన నిత్యానందరెడ్డి దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం జనార్ధన్‌రెడ్డి జంగంపల్లె నుంచి కమలాపురానికి వస్తుండగా మార్గ మధ్యలో నిత్యా నందరెడ్డి కారం పొడి చల్లి దాడి చేశాడు. ఈ దాడిలో జనార్ధన్ రెడ్డి కాలు, చేతికి గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాయినాథ శర్మకు అనుచరుడు. విషయం తెలుసుకున్న శర్మ స్థానిక క్రాస్ రోడ్డు పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా నిత్యానందరెడ్డికి చెందిన పురుగు మందుల దుకాణానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఫైర్ అధికారులు సకాలంలో వచ్చి మంటలను అదుపు చేశారు. జంగంపల్లె గ్రామంలో తిరిగి ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కోడిగుడ్లు విసిరిన ఘటనలో పరస్పర కేసులు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా గురువారం రాత్రి మైదుకూరు రోడ్డులో కోడి గుడ్లు విసిరిన ఘటనలో పరస్పర కేసులు నమోదయ్యాయి. పాదయాత్ర సాగుతున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు గుడ్లు విసిరారని ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని స్టేషన్‌లో అప్పగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మైదుకూరు రోడ్డులో కొందరు వ్యక్తులు గురువారం రాత్రి తనపై దాడి చేసినట్లు మోడంపల్లెకు చెందిన శివప్ప అనే వ్యక్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నారాలోకేష్ పాదయాత్రలో కొందరు వ్యక్తులు కేకలు వేస్తూ వెళ్తున్నారని, ఎందుకు కేకలు వేస్తున్నారని ప్రశ్నించినందుకు తనపై దాడికి దిగినట్లు అతను ఫిర్యాదులో పేర్కొన్నాడు. శివప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో చోరీ

సిద్దవటం : మండల కేంద్రమైన దిగువపేటలోని బేల్దారి వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాను సిద్దవటం ఎంఆర్‌సీ నుంచి శుక్రవారం సాయంత్రం నూతన పాఠ్య పుస్తకాలను తీసుకొని పాఠశాలలో పెట్టేందుకు వెళ్లగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల గదికి ఉన్న తాళాన్ని పగులగొట్టి ఉంది.లోపలికి వెళ్లి చూడగా వస్తువులను చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. నిందితులు పాఠశాల ప్రహరీ గోడ వద్ద చెక్కను అమర్చుకొని లోపలికి వెళ్లారన్నారు చోరీ జరిగిన విషయాన్ని సంబంధిత ఎంఈఓ శంకరయ్యకు తెలియజేశారు. శనివారం ఆయన చోరీ గురించి ఆరా తీశారు. బీరువాలో నుంచి చిందరవందరగా ఉన్న వస్తువులను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధురాలు మృతి


మృతి చెందిన వృద్ధురాలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు నుంచి పులివెందులకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వృద్ధురాలు (65) మృతి చెందింది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు శనివారం రాత్రి 7.30 గంటలకు వృద్ధురాలు ఎర్రగుంట్లకు టికెట్ తీసుకొని పులివెందుల ఆర్టీసీ బస్సు ఎక్కింది. సీట్లో కూర్చున్న ఆమె కొద్ది సేపటి తర్వాత మృతి చెందింది. ఆర్టీసీ అధికారులు సమాచారాన్ని పోలీసులకు అందించారు. సీఐ ఇబ్రహీం అక్కడికి చేరుకొని పరిశీలించారు.ఆచూకి తెలిపే వివరాలేమీ ఆమె వద్ద లేవు. ఆకు కూరల బస్తా ఉండటంతో ఆమె మార్కెట్‌లో ఆకు కూరలు వ్యాపారం చేస్తుంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. వృద్ధురాలికి సంబంధించినవారు ఎవరైనా ఉంటే టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.